
ఆ ఊరు మదిలో మెదిలినప్పుడు పదునైన బాకు పెట్టి హృదయాన్ని నిట్టనిలువుగా చీల్చుకున్న భావన నిలువెల్లా ఆవరిస్తుంది. ఒక రకమైన అపరాధం నా కళ్ల ముందు నూనె తెట్టులా పైకి తేలి తొణికిసలాడుతూ ఉంటుంది.

మళ్లీ చానాళ్ల తరువాత ఊరికి పోవాల్సిరావడంతో మనసు బాధగా మూలిగింది. ఏ మాత్రం తప్పించుకోవడానికి వీలు లేని సందర్భం కాబట్టే బయలుదేరాను.



# అంతరాంతరాలు

## మంచికంటి

బస్సు హైవే రోడ్డు మీద జర్రున జారుతుంది. లోపల ప్రయాణికుల పిచ్చాపాటీ మాటలతో ఆలోచనలు మరీ గజిబిజిగా మారిపోయి చికాకుగా అనిపించింది.

చూపులు కిటికీ గుండా బయటకు మళ్లాయి. నిర్మలమైన ఆకాశంలో ప్రశాంతంగా కదులుతున్న మేఘాలు. వెనక్కు పరుగెత్తుతున్న పచ్చపచ్చని చెట్లూ, పంట పొలాల్నీ చూస్తుంటే, మనసు మారుమూలల్లో ఆ ఊరూ, వాతారవరణ మంతా ఒక్కసారిగా కళ్లముందు కొచ్చాయి. ఏదో చేదు మాత్ర తిన్నట్లుగా ఆలోచనల్నిండా అసహనం చోటు చేసుకుంది.

ఆ ఊళ్లో అడుగు పెట్టాల్సిన ప్రతిసారీ. ఆత్మన్యూనతాభావం నిలువెల్లా ఆవరించి, తను వంతా దిగులు మేఘం కమ్ముకుంటుంది.

పద్మకి ఎదురుపడాల్సి వొచ్చినప్పుడల్లా నాలోకి నేను ఎంతగా కుంచించుకుపోతానో! ఎదురుపడి ముఖం చూయించటానికీ సిగ్గుగా అనిపిస్తుంది. ఆమెను చూడ్డంతోనే ఏదో పోగొట్టుకున్నానన్న భావన పరిపరివిధాలుగా పోతుంది.

ఆమె ఎదురుపడ్డప్పుడు నన్ను ఈసడించుకుంటేనో, చీదరించుకుంటేనో, అసహ్యించుకుంటేనో బాగుండునని అని పిస్తుంటుంది.

కానీ ఎప్పుడూ దానికి అపసవ్యంగానే జరుగుతుంది. ఆమె కనిపించీ కనిపించగానే, చల్లని వాయుసమీరం వొళ్లంతా సోకినట్టుగా గలగలా నవ్వుతుంది. తను కన్న కలలన్నీ ఈడేరినట్టు మనసు మయూరంలా పురి విప్పి నాట్యం చేస్తున్నట్టే ఉంటుంది. హాయిగా మల్లెల పరిమళం సోకినట్టుగా మాట్లాడుతుంది. ఆ మధురమైన కంఠం నుంచి కబుర్లెన్నో ప్రవాహంలా సాగుతాయి.

తను ఉన్న చోట ఓ సుగంధభరితమైన తెమ్మెర చుట్టూ వ్యాపిస్తూ ఉంటుంది. అంత జరిగినా, దాన్ని గురించి పట్టించుకోకుండా అంత నిండు మనసుతో ఎలా మాట్లాడుతుందో ఇప్పటికీ అర్థం కాని ప్రశ్న. అలా ఉండాలంటే మనిషికి ఎంత సంయమనం కావాలి! నిండు కుండలా తొణక్కుండా బెణక్కుండా ఎంత మందలా ఉండగలరు?

తనను కలిసినప్పుడల్లా ఎన్నో ప్రశ్నలు సంధిస్తుందేమో... నిలదీస్తుందేమో... ఎవ రెంత సంతోషంగా ఉన్నారో ఒక్క సారి చూసుకో... అంటూ గేలి చేస్తుందేమో! అని ఎన్ని సార్లు ఎదురు చూశానో...

బస్సు పెద్ద కుదుపుతో ఆగడంతో ఆలోచనల సుడుల్లో నుండి బయట పడ్డాను. బస్సు దిగి రోడ్డు వెంటే వడివడిగా ప్రవహిస్తున్న పంట కాలువ వెంబడే నడవసాగాను. కాలువలో నీళ్లు గలగలమంటూ దొర్లిపోతున్నాయి. వాటి వెంటే జ్ఞాపకాలు గాయాల్లా కదలబారసాగేయి.

ఈ కాలవని అంటి పెట్టుకుని పద్మ తోటి ఎన్ని బాల్యస్మృతులు నిండి ఉన్నాయో! ఆ బాల్యం ఎంత మృదుమధురమైనది! పద్మ పుట్టినప్పటి నుండీ నీ పెళ్లామేరా... అంటుంటే ఊహలు. తెలియని ఆ రోజుల్లోనే ఎంత సంబరంగా అనిపించేది. ఆమె మీద ఏదో హక్కును పొందినట్టుగా, ఆమె తన సొంతమే అయిననట్టుగా, ఆమె మీద సర్వాధికారాలూ నావే అయినట్టుగా భావించేవాడిని.


**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం - ఎ.పి.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో రు. 5000/-ల నగదు బహుమతి పొందిన కథ**

చీటికి మాటికీ ఎన్ని సార్లు కొట్టేవాడిని, ఎలా అవమానించేవాడిని. అయినా పాపం పిచ్చిది, అప్పుడు, అలిగినా, తనే వొచ్చి మళ్లీ పలకరించేది.

"నీకు కోపం ఎక్కువ మామయ్యా. ఆలోచన లేకుండా ఏ పనైనా చేస్తావు. ఇట్టయితే నీతో వేగడం కష్టం బాబూ!" అనేది.

"నిన్నే వేగమన్నేదులే పో!" అని బింకంగా మాట్లాడేవాణ్ని, ఎన్ని మాట లన్నా, ఏం చేసినా తనే పడి ఉండాలన్న ధీమాతో.

తను కూడా నేనేం చేసినా...మాట్లాడినా భరించాల్సిందే నన్నట్టుగా ఉండేది. ఎప్పుడైనా తను నా మీద కోప్పడ్డా పట్టించుకునేవాడిని కాదు. బుంగమూతి పెట్టి చాలా సేపు మాట్లాడే ది కాదు. తరువాత మళ్లీ మామూలే...



ఒక్క సారైతే కాల్లో ముల్లు గుచ్చుకుంటే కింద కూర్చోని బలవంతంగా లాగుతుంటే నా కంటే తనే విలవిల్లాడిపోయింది. కాలు పైకెత్తి తన మోకాలిపై పెట్టుకుని, ముల్లు గుచ్చుకున్న చోట నోటితో గట్టిగా కొరికి, "ఇది చెడిపోయిన నెత్తురు. ఇది కాల్లోనే ఉంటే వొళ్లంతా విషమై పోయిద్ది" అంటూ నోట్లోకి వొచ్చిన రక్తాన్ని బయటకు ఊసేసి, ఎన్ని రకాల వైద్యాలు చేసిందో!

"మామయ్యా నీ కసలు నోట్లో నాలికే లేదు. ఎవ్వరు ఏమన్నా పట్టించుకోవు. ఇట్టయితే ఎట్ట బతుకుతావు?" అంటూ ఒక్కసారి నా మీద అంతు లేని జాలి, కురిపించేది. వాళ్లింట్లో ఏ కొత్త పిండి వంటలు చేసినా ముందు తెచ్చి నాకే పెట్టేది. నేను తిన్న తరువాత తను తినేది. ఇంట్లో వాళ్లమ్మ చెప్పీచెప్పక ముందే గిన్నెకు సర్దుకుని, మామయ్యా వాళ్లకు ఇచ్చి వస్తానంటూ మా ఇంటికి వచ్చి నా చేత బలవంతంగా తినిపిస్తూ, నా నోటి వంక చూస్తూ ఉండిపోయేది. నేను బాగున్నాయని చెబితే కేరింతలు కొడుతూ వెళ్లిపోయేది. పెసరకాయలు, అలసందకాయలు, బలుసు కాయలు, కలేకాయలు, నేరేడు కాయలు ఏ సీజన్లో దొరికే కాయలైనా తన చేతిలోకి వచ్చాయంటే, ముందు ముందు నాకు చేరాల్సిందే!

తనకి కొత్త బట్టలు కుట్టిస్తే అవి వేసుకుని ముందు నా దగ్గర కొచ్చేది. "ఇయిగో నా కొత్త గుడ్డలు. నీకేయి? కుట్టియ్యలేదా' అత్తా, మామయ్యకి కొత్త గుడ్డలు ఎప్పుడు కుట్టిస్తావు?" అంటూ అమ్మని దబాయించేది.

"కుట్టిస్తా లేవే! ఇప్పుడే ఇట్టా దబాయిస్తుండావు... ఈ ఇంటికి కోడలువైతే నన్ను ఇంట్లో కూడా ఉండనిచ్చేటట్టులేవే!" అంటూ అమ్మ, పద్మని దగ్గరకు తీసుకుని మెటికలు విరిసేది. అంతే, కాళ్ల గజ్జెలు ఘల్లుఘల్లు మంటుంటే తారాజువ్వలా అక్కడి నుండి మాయమయ్యేది.

వాళ్లింట్లో గేదె ఈనిందంటే జున్ను పాలు ముందు మా ఇంట్లో ఉండాల్సిందే! "మామయ్య తాగడు లేవే'. అని అత్తయ్య అంటుంటే... "మా అత్తామామలు లేరా ఏంది తాగడానికి?" అంటూ ఏడుపు ముఖం పెట్టేదంట.

"ఏదైనా ముందు మీ ఇంటి కొస్తేనే అమ్మా, మా నోట్లోకి పోయేది" అత్తమ్మ అమ్మతో చెబుతుంటే, "నా కోడలు గడుసుదేనమ్మా. నోట్లో నాలుక లేని నా కొడుకుని ఎట్ట ఆడిస్తుందో రేపు" అంటూ అమ్మ తెగ మురిసిపోయేది. అప్పుడు చూడాలి, అమ్మ కళ్లల్లో ఎంత గర్వం తొణికిసలాడేదో!

"ఏరా శీనూ, ఇదేనా రావడం? దగ్గర చుట్టాలింట్లో పెళ్లయినా ముహూర్తానికి రావడం ప్యాషన్ అయిపోయిందిరా ఉజ్జోగస్తులకి" నారాయణ మామ పలకరిస్తుంటే బాల్యం నుండి బయటకు తొంగి చూశాను.

"సెలవు పెట్టడానికి వీలు కాలేదు మామా!" శుద్ధ అబద్ధం చెప్పి ముందుకి సాగిపోయాను.

ఎప్పుడూ పద్మ ఎదురుపడే సందర్భం ఒక నరకమే. అప్పుడు నన్ను నేను పాతాళలోకంలోకి పాతేసుకున్నట్టుగా అనిపిస్తుంది. రెండు-మూడు రోజులు ఊళ్లోనే... అదీ తన ఎదురుగా ఉండాల్సి వొస్తే ఆత్మన్యూనత పెనుబాములా చుట్టేసి క్షణక్షణమూ మెదడు పొరల్లో జ్ఞాపకాలు గిర్రున తిరుగుతూ ఒక పట్టాన కూర్చోనివ్వవూ... నించోనివ్వవూ...

అప్పటి దాకా కలిసి మెలిసి కేరింతలు కొడుతూ, తన్నుకుంటూ, తిట్టుకుంటూ ఆడుతూ, పాడుతూ, గెంతుతూ ఒకరి మీద, ఒకరం పడుతూ లేస్తూ, ఒకరి నోట్లో నుండి ఇంకొకరం తీసుకుని గలగల పారే సెలయేరులా ఉండే పద్మ కాస్తా, ఆ ఒక్క మార్పుతో సముద్ర మంత గంభీరంగా మారిపోయింది. తన మాట లో, చూపులో ప్రతి కదలికలో ఎంతో హుందా తనం కొట్టొచ్చినట్టు కనిపించసాగింది.

అంతకు ముందు పద్మని చూసినవాళ్లు పుష్పవతి అయిన తరువాత చూస్తే, ఆమెలో వచ్చిన మార్పుకి నోటికి అడ్డంగా చేతులు పెట్టుకునేవాళ్లు.

ఊళ్లో బళ్లో చదువు అయిపోవడంతో తను ఊళ్లోనే పరిమితమై పోయింది. పైచదువుల కోసం నేను పట్నం వెళ్లాల్సి వొచ్చింది. అప్పటి నుండీ ఇద్దరికీ మధ్య తెలియకుండానే దూరం పెరగసాగింది. పట్నం నుండి వొచ్చినపుడల్లా ఏదో ఒక నెపంతో ఇంటి కొచ్చేది. జింకలా గంతులు వేసే పద్మ ఎంత నెమ్మదిగా, శాంతంగా, గంభీరంగా మారిపోయిందో ఆశ్చర్యం వేసేది.

సైగసైగ్గా వచ్చి ఏదో మాట్లాడాలని ప్రయత్నించేది. మాటల్లో తడబాటు. ఏమీ మాట్లాడలేకపోయేది. కొంగు చాటు నుండి ఏదో ఒకటి బయటకు తీసి అక్కడ పెట్టి వెళ్లిపోయేది.

పైపై చదువుతో, కొత్త కొత్త పరిచయాలతో, పట్నం మోసుకొచ్చిన నాగరికతతో కొద్దికొద్దిగా గొంగళి పురుగులా నాలో మార్పులు వొచ్చేశాయి. ఒక్కోసారి పద్మతో చనువుగా ప్రవర్తించలేక పోతున్నానేమో... కలుపుగోలుగా మాట్లాడలేకపోతున్నానేమో... అని నాకే అనిపించేది.

అందుకేనేమో, పాపం పద్మ, అప్పుడప్పుడూ "నువ్వు బాగా చదువు కుంటున్నావు నేనేమో చదువు మానేసి పొలానికీ, పొగాకు గ్రేడింగులకీ పోయి మొరటుగా తయారౌతున్నాను. పట్నంలో కొత్త కొత్త స్నేహాలు... కొత్త కొత్త మనుషులూ... మేము గుర్తుంటాములే మామయ్యా... మాతో మాట్లాడే టైము నీ కెక్కడుంది?" అంటూ దెప్పి పొడిచేది. అలా మాట్లాడేటప్పుడల్లా నా మీద ఏదో ఒక అపనమ్మకపు కన్నీటి తెర కళ్లల్లో సన్నటిపొరలా విచ్చు కునేది.

"పిచ్చిదానా! చదువుకుంటే మాత్రం మనుషుల్నీ మర్చిపోతారా ఏంది?" అనేవాణ్ని గానీ, ఎప్పుడూ నా మాటల్లో తనకు కావల్సినంత భరోసా దొరకనట్టే ఉండేది.

"ఎప్పటికీ నా జీవితభాగస్వామి నువ్వే!" అని గట్టిగా చెప్పలేకపోయే వాడిని. అప్పుడు ఆ విధంగా చెప్పాలని కానీ, చెప్పకుండా ఉన్నానని కానీ ఏ కోశానా అనిపించలేదు.

ఎంత ఒద్దు ఒద్దని వారించుకున్నా. గతం దొంతర్లలో కూరుకుపోతూనే

ఉన్నాను. ఎంత విసురుకున్నా కందిరీగల్లా ఆలోచనలు చుట్టూరా ముసురు కుంటూనే ఉన్నాయి.

ఇంటికి వొచ్చీ రావడంతోనే నాన్న కోప్పడ్డాడు. "ఇంట్లో శుభకార్యానికి కూడా ఇప్పుడంట్రా రావడం? అవతల వాళ్లు ఏమనుకుంటారని కూడా లేకుండా పోయిందిరా నీకు! చదువుకునోళ్లం అంటారు గానీ... మర్యాదా మన్ననా ఉండొద్దంట్రా? ఆ చెంబు తీసుకొని కాళ్లూ చేతులూ కడుక్కో" విసురుగా అన్నాడు.

మారు మాట్లాడకుండా లేచాను ఆయన కోపం సబబే అనిపించినా, నా మనసులో బాధ ఆయనకెలా తెలుస్తుంది? ఇక్కడికి రావడ మంటే గుండెని రంపంతో కోసుకున్నట్లేనని ఎలా చెప్పను నాన్నా నీకు? వస్తా వస్తా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఒస్తున్నానని ఎట్లా చెప్పాలి? ఎవరు అర్థం చేసుకుంటారు నన్ను ఆమె ఒక్కతి తప్ప.

డిగ్రీ కూడా అయిపోయింది. మళ్లీ పెళ్లి ప్రస్తావన వొచ్చింది. అప్పటికి కొత్తగా రెక్కలొచ్చిన ఊహలు మనసులో చిలిపి అల్లరి రేపే తరుణం. కోర్కెలు విహంగాలై సంచరించే సమయం. యవ్వనం పురివిప్పి రంగురంగుల ఇంద్రధనుస్సులా వినీలాకాశంలో సంచరిస్తూ ఉంది. తనువు దరహాసమై, మనసు మధుమాసమై, ఏవో... కోయిల కూజితాలు హృదయంలో చప్పుళ్లు చేస్తున్న తరుణం.

పోగొట్టుకున్న విలువైన ఆమె కళ్ల ముందు తిరుగుతుంటే అగాధాల్లో నుండి ఉబికివచ్చే బాధని ఎవరితో పంచుకోవాలి? మౌనంగా కాళ్లూ, చేతులూ కడుక్కుని తుడుచుకుంటూ మంచమ్మీద నాన్న పక్కనే కూర్చున్నాను.

"మళ్లీ కూర్చుంటా వెందుకురా! ముందు అక్కడికి పోయి కనపడు. అన్నాలు తినటం కూడా అయిపోవస్తుంటే! వాళ్లేమో రాలేదు రాలేదు అంటుండ్రి. వాళ్లకి సమాధానం చెప్పలేక... నేనొచ్చి ఇక్కడ సావాల్సొచ్చింది" నాన్న విసుకున్నాడు.

వెంటనే లేచి బయలుదేరాను. అడుగులు ముందుకి పడుతున్నాయన్న మాటే కానీ, ఆలోచనలు మాత్రం గతంలోకే ఈడ్చేస్తున్నాయి. తప్పు చేశావు...తప్పు చేశావు అని అంతరాత్మ పదేపదే గుచ్చిగుచ్చి ప్రశ్నిస్తున్నట్లే అనిపిస్తుంది.

డిగ్రీ చదువుతున్నప్పుడు తనతోటి వాళ్లందరికీ పెళ్లిళ్లు అయిపోతున్నాయి. "నువ్వేమో చదువుకుంటున్నావు. పద్మ విషయమేం?"దని మామయ్య వాళ్లు నాన్నని అడిగారు.

"చదువుకుంటున్నాడుగా వాణ్నే ఒక మాట అడగండి" అని నా వైపే చూయించారు. నన్ను అడిగితే నేనూ అదే సమాధానం చెప్పాను. మనసులో ఏదో ఊగిసలాట అప్పటి నుండే మొదలైంది. తెలియని అంతరాలేవో పెరిగిపోతున్నాయేమో నని సందేహం. అయినా ఏదీ తేల్చి ఇదీ అని చెప్పలేని సందిగ్ధం.

డిగ్రీ కూడా అయిపోయింది. మళ్లీ పెళ్లి ప్రస్తావన వొచ్చింది. అప్పటికి కొత్తగా రెక్క లొచ్చిన ఊహలు మనసులో చిలిపి అల్లరి రేపే తరుణం. కోర్కెలు విహంగాలై సంచరించే సమయం. యవ్వనం పురి విప్పి రంగురంగుల ఇంద్రధనుస్సులా వినీలాకాశంలో సంచరిస్తూ ఉంది.

తనువు దరహాసమై, మనసు మధుమాసమై, ఏవో... కోయిల కూజితాలు హృదయంలో చప్పుళ్లు చేస్తున్న తరుణం. అప్పుడు పెళ్లి గురించి ఆలోచనా? ఇప్పుడే పెళ్లంటే కష్టమే మరి. ఇప్పుడు పెళ్లి చేసుకుని ఏం చెయ్యాలి నేను? మనసు ఎదురు తిరిగింది. నేను కూడా తిరిగాను.

"అయితే ఎప్పుడు చేసుకుంటావో చెప్పరా. అవతల పిల్లతోటి వాళ్లంతా ఇద్దరు-ముగ్గురు పిల్లల్ని సంకనేసుకుని ఉన్నా, ఆ పిల్లేమో నీ కోసం కూర్చోనుంది. నువ్వేమో చదువూ అంటూ చెబుతానే ఉంటివి. సరేలే అని వాళ్లూ నీ కోసం అట్నే ఆగేరు కదా! ఇప్పుడు చదువు అయిపోయింది. ఇంకా వాళ్లని ఆగమనడం ధర్మం కాదు మనకి. అవతల ఆడపిల్లయి పోయె. ఎవరైనా ఒకటే వాళ్ల పిల్లయితే ఒకటీ మన పిల్లయితే ఒకటీనా? మీ మామ కూడా గట్టిగా తేల్చుకోవాలనే వొస్తన్నాడు" నాన్న గట్టిగానే హెచ్చరించాడు.

బాధలో కూడా మామయ్య ఆ రోజు గట్టిగానే నిలదీశాడు. ఆయన బాధ నంతా ఏకరువు బెట్టాడు. అయినా కూడా వాళ్ల వైపు నిలబడి ఒక్కసారి ఆలోచించాలన్న ఇంగితం లేకపోయిం దానాడు నాకు.

ణణఏదోక ఉద్యోగం లేకుండా పెళ్లి చేసుకోలేను మామయ్యా!" అనడంతో, నా స్వార్థం నన్ను పట్టి బంధించిందేమో అనిపించింది. చదువుకున్నాను గదా, వాళ్లలో లేనిది నాలో ఏదో కొత్తగా ప్రవేశించిందనే అహంకారభావనేమో అది!

నా కోసం ప్రతిక్షణమూ తను వెల్లా కనులై నిలిచే పద్మే నా ముందు దోషిలా నిలబడినట్టయింది, మామయ్య బాధను చూస్తుంటే. అయినా కూడా నా మనసు కరగలేదంటే నేను ఎంత కఠినాత్మకంగా వ్యవహరించానో తల్చుకుంటేనే తల కొట్టేసినట్లు అనిపిస్తుంది.

చివరికి మామయ్యే రాజీ ధోరణికి వొచ్చాడు. "పెళ్లి చేసుకున్నాక ఉజ్జోగాలు వొచ్చినవాళ్లు ఎంత మంది లేరు! అందరూ ఉజ్జోగాలే వొచ్చాక పెళ్లిళ్లు చేసుకుంటే ఈ రోజుల్లో ఎంత మందికి పెళ్లిళ్లు అవుతాయి!" అనే వాదం కూడా వినిపించాడు.

"వాళ్లందరి సంగతేమో నాకు తెలియదు. నాకు మాత్రం ఉజ్జోగం రావాలి. ఆ తరువాతే పెళ్లి" అని ఖరాఖండిగా తెగేసి చెప్పెయ్యడంతో, ఇంక ఎవ్వరూ ఏమీ మాట్లాడలేక పోయారు.

"అయితే అప్పటి దాకా ఆగి ఉండమంటావా! ఉంటే అప్పుడైనా చేసుకుంటావా? మళ్లీ ఇయ్యా లొకటి చెప్పి, రేపు మీ పిల్ల చదువుకోలేదూ... నాకు చదువుకున్నోళ్లు బోలెడు మంది ఉండారని అన్నావనుకో. దాని బతుకు రెంటికీ చెడ్డ రేవ డవుతుంది" చాలా ముందు చూపుతో అడిగి చూశాడు మామయ్య.

"అదేదో తేల్చి చెప్పరా. రేపు ఏం జరిగినా మా మీద కొస్తది. ఊళ్లో ఉండే వాళ్లం మేము. అందరి ముందూ తప్పుడోళ్లం కావడం మాకిష్టం లేదు" నాన్న కూడా అసహనంతో తన బాధనూ వెలిబుచ్చాడు.

అప్పటి దాకా నా మనసులో ఉన్న భావ మేదో నాకే స్పష్టంగా తెలియదు. అంత మంది ఒక్కసారిగా నిలదీయడంతో, నా అంతరాత్మను అప్పుడు కానీ శోధించుకోలేకపోయాను. ప్రశ్నించుకున్నాక కూడా అవునూ...కాదూ అని సమాధానం చెప్పుకోవడం అంత తేలిక కా దనిపించింది.

అప్పటికి ఆ గండం నుండి తప్పుకోవడానికే అన్నానో, లేదా బాల్య జ్ఞాపకాల్ని యవ్వనానుభవాలు మింగేయడం వల్ల అంత తొందరగా ఒక నిర్ణయానికి రాలేకపోయానో, లేక చదువుతో తెలివి పెరిగిపోయాక పద్మని చిన్న చూపు చూశానో గానీ, నా స్వార్థం ఎన్నో అపురూపమైన అనుభవాల్ని మింగేసేలాగా నా నోటి వెంట ఆ సమాధానం వచ్చింది.

"ఏమో, ఇప్పటికిప్పుడు నన్ను తేల్చి చెప్పమంటే నేనేం చెప్పేది? అది మీ ఇష్టం. ఉంటే ఉండండి. లేకపోతే మానుకోండి. నేనెవర్ని చెప్పడానికి? కర్ర విరక్కుండా పాము చావకుండా సమాధానం చెప్పాను.

ఆ సమాధానానికి మామయ్య చాలా నొచ్చుకున్నాడు. "వాడు అంత-అపనమ్మకంగా చెబుతూంటే... మేము మాత్రం వాడి మీద నమ్మకం పెట్టుకోని ఎట్ట ఉండాల? ఏదో... పుట్టినప్పటి నుండి అది వాడికొరాసి పెట్టుంది అనుకున్నాం. కుటుంబరంలో కుటుంబరం కలిసిపోతుంది అనుకున్నాం. కానియ్యండి. బిడ్డల్ని కనగలం గానీ వాళ్ల రాతల్ని కనగలమా? ఇయ్యాల సదువుకున్నోళ్లు పైకి చూడడం సహజమే! ఎవరు మాత్రం ఏం జేస్తాం. దాని రాతెట్టుంటే అట్ట జరుగుద్ది" అంటూ ఏ విషయాన్నయినా తేలికకగా తీసుకునే మామయ్య, తుఫాను తాకిడికి విలవిల్లాడే చెట్టులా పెను కంపానికి గురయ్యాడు. దేనికీ అంత త్వరగా కన్నీళ్లు పెట్టని ఆయన, అటు తిరిగి పై కండువాతో కళ్లొత్తుకుంటూ వెళ్లిపోయాడు.

అయినా నా మనసు కరగలే దా నాడు. అంతటితో నా గుండెల్లో బరువు దించేసుకున్నట్టు అయిపోయింది. అది సంతోషించాల్సిన విషయమో దుఃఖ పడాల్సిన విషయమో ఆ నాడు తెలియలేదు నాకు.

అయితే నేను అన్న మాటలు పద్మకి తెలిసినప్పుడు, ఆమె గుండెల్లో ఎన్ని అగ్నిపర్వతాలు బద్దలై ఉంటాయో! ఎన్ని పెను తుఫానులు చుట్టేసి ఉంటా

యో! ఏ సుడిగుండంలో పడి కొట్టుకుపోయి ఉంటుందో ఇప్పుడు ఊహించుకుంటే, మనసుని మెలి తిప్పి పిండినట్టు అనిపిస్తుంది. ఆ ఆలోచన వొచ్చినప్పుడల్లా ద్రోహచింతన వెంటాడుతూనే ఉంటుంది.

కొత్త తాటాకులతో వేసిన పెళ్లి పందిరిని సమీపించడంతో, ఒక రకమైన ఆనందపరిమళం ముక్కు పుటాలకు సోకి, మధురమైన అనుభూతి లోయల్లోకి పాకి, ఒక గాఢానుభూతిని అంతర్గతం చేస్తుంది.

బంతి భోజనాలు జరుగుతూ ఉండడంతో, అక్కడ హడావిడిగా ఉంది. బల్లలు, కుర్చీలు వేసేవాళ్లు, తీసేవాళ్లు, టేబుళ్లపై ఆకులు వేసేవాళ్లు, వొడ్డించేవాళ్లు, దేగిశాలు అటూ ఇటూ మోసేవాళ్లు, పిల్లా, పెద్దా, ఆడా, మగా సందడి సందడిగా ఉంది.

"ఏరా పెళ్లికొడకా! ఇంటల్లుడివి. రొండ్రోజులు ముందొచ్చి పెళ్లి పనులు చూడాల్సింది పోయి, అన్నాలు తినే యేళకంట్రా వొచ్చేది?" కొండారెడ్డి బాబాయ్ పలకరించాడు.

ఆయన వైపోక చిరునవ్వు విసిరి, దూరంగా ఉన్న వాళ్ల వైపు చూపు సారించాను. ఆడవాళ్లు గుంపుగా ఉండి ఏదో ముచ్చట్లలో ఉన్నారు. అందరి మధ్యలో వినీలగగనంలో తారకలా మెరిసిపోతూంది పద్మ. ఎంత దూరంలో ఉన్నా ఇట్టే ఆకర్షించే అందం ఆమెది. తల తిప్పింది. చూపులు నా వైపు సారించింది. ఎంతో హుందాతనం కొట్టొచ్చినట్టుగా ఆమె మోము వికసిత పుష్పంలా ఉంది.

అల్లరి బాల్యం విర్రై వొంగి... యవ్వనమై... ఉద్రేకాలు ఊసులు చెప్పుకుని... బాసలు చేసుకున్న వయసు... అలసి... సొలసి... సుదీర్ఘకాలం అలా సాగి... ఇప్పటికి పెద్దరికం సంతరించుకుంది.

ముద్దమందారంలా ముఖం తూరుపు ముఖాన సూర్యోదయంలా ఎర్రని బొట్టు. సరళరేఖలా తీసిన పాపిట. ముగ్ధలా, మనోహరంగా ఎంత దూరానున్నా, చూపుల్లో ఉట్టి పడే అభిమానం కొట్టొచ్చినట్టుగా కనిపిస్తుంది. అది భరించడమే నాకు సాధ్యం కావడం లేదు.

నా దగ్గరకు ఎవర్నో పంపించింది రమ్మని. తనను చూస్తే ముచ్చెమటలు పోసేవి ఒకప్పుడు. ఇప్పుడైతే సుదీర్ఘమైన ఒక నిర్వేదం. నిలకడగా ఉండే నీళ్లలోని నిశ్చలత. తను వంతా ఆవరించిన దిగులు మేఘ మొకటి వచ్చి మంచులా చుట్టూ కమ్ముకుంటున్నట్టుగా ఉంటుంది. తడబడే అడుగులు... హృదయసరోవరంలో సన్నని అలజడి... నెమ్మదిగా తన వైపుగా కదిలాను.

పల్లెటూరి పిల్ల అయినా, నా అంత చదువుకోకపోయినా ఎంత హుందాతనం ప్రదర్శించిం దా నాడు! "పోనియ్యండి మామయ్య చదువుకున్నాడు కదా! నేనే తనకు తగననీ, బాగా చదువుకున్న అమ్మాయిని చేసుకుంటే ఇద్దరికిద్దరూ ఈడూజోడుగా ఉంటారు. మీరేమీ మామయ్యను బలవంతపెట్టొ"ద్దని చెప్పిందంట వాళ్ల నాన్నతో.

ఆ మాటలు చెబుతున్నప్పుడు ఎంత లావా ఆమె గుండెల్లో ప్రవహించిందో! ఎన్నో భూకంపా లొక సారి చుట్టుముట్టి ఉంటాయో! వేరే సంబంధం ఖాయం చేసుకునేటప్పుడు, నాన్నను పిలిచి, ఇణమల్లీ తప్పు మా మీద పెడితే కుదరదు. సంబంధం చూసుకున్నామని మీ వాడితో చెప్పు" అని చెప్పి పంపించాడు.

నాన్న ఆ మాట చెప్పినప్పుడు నాకు చీమ కుట్టినట్టయినా లేదు. పద్మ వేరే వాళ్ల సొంతం అయిపోతుందన్న బాధ ఎక్కడో ఓ మూల ఉన్నా, సన్నగా మనసు మూలిగినా, అ దేమంత పెద్ద విషయంలా ఆ నాడు అనిపించలేదు. కేవలం నా అవకాశవాదమే దాన్ని జయించిందేమో!

ఏ విషయం చెప్పకుండా మౌనం వహించాను. దాంతో మౌనం అర్ధాంగీకారమో, సంపూర్ణాంగీకారమోలా భావించి వాళ్లా సంబంధమే ఖాయం చేసుకున్నారు.

పెళ్లి నిశ్చయ మయ్యాక ఒక సారి పద్మ ఇంటికి వచ్చింది. ఇణపెళ్లికి పిలవటానికి వచ్చాను మామయ్యా" అంది.

"ఇప్పుడు నన్ను పెళ్లి చేసుకోనంత మాత్రాన నా మామయ్యవు కాకుండా పోతావా ఏంది? ఎక్కడున్నా నీ బాగోగులు కోరేదాన్నే. అట్టనే నువ్వు కూడా ఉంటావనే అనుకుంటున్నా" పైట చెంగు నోటి కడ్డం పెట్టుకుని అదే పోవడం. పూపొద ఎంతగా కదిలిపోయి ఉంటుందో! హృదయం ఎన్ని ముక్కలై ఉంటుందో! ఆ మూగమనసు ఎంతగా రోదించి ఉంటుందో!

"తొందరపడ్డా రేమో కదా పద్మా!" తప్పు నాదగ్గర పెట్టుకొని ఎదుటివాళ్లలో కాగడా పెట్టి వెదక బోయాను.

"ఎంత చెట్టుకు అంత గాల్లే మామయ్యా! నీ మనసులో ఏముందో నువ్వు చెప్పకపోయినా తెలుస్తానే ఉందిలే! ఇంకా తప్పు మా మెడకి చుట్టాలని చూడటం భావ్యం కాదు. చదువుకున్న అమ్మాయిని చేసుకోవాలని బలంగా నీ మనసులో ఉంది. అందుకే ఆ కోరిక నీ చేత అట్టా మాట్లాడించింది. పోనియ్యిలే! నా కింతే రాసిపెట్టుందని సరిపెట్టుకుంటాను. చదువూ సంధ్య ల్లేనిదాన్ని నన్ను చేసుకుని నువ్వు మాత్రం ఏం సుఖపడతావులే! బాగా చదువుకున్న అమ్మాయిని చేసుకుని ఇద్దరూ హాయిగా ఉండండి. ఈ మాట అక్కసుతోనే, ఈర్ష్యతోనో అంటున్నానని మాత్రం అనుకోవొద్దు మామయ్యా! మనస్పూర్తిగానే అంటున్నాను. ఇయ్యాల నువ్వు నన్ను చేసుకోలేదని బాధ ఏ కోశానా లేదు. ఎక్కడైనా నువ్వు సుఖంగా సంతోషంగా ఉండడమే నాకు కావాల్సింది. ఎప్పుడూ నువ్వే... నువ్వే... అని నీ వెంటబడి తిరిగాను. నిద్రలోనూ, మెలకువలోనూ నీ ఆలోచనల్తోనే ఇన్నాళ్లూ తిరిగాను.

ఇణఇప్పుడు నన్ను పెళ్లి చేసుకోనంత మాత్రాన నా మామయ్యవు కాకుండా పోతావా ఏంది? ఎక్కడున్నా నీ బాగోగులు కోరేదాన్నే. అట్టనే నువ్వు కూడా ఉంటావనే అనుకుంటున్నా" పైట చెంగు నోటి కడ్డం పెట్టుకుని అదే పోవడం. పూపొద ఎంతగా కదిలిపోయి ఉంటుందో! హృదయం ఎన్ని ముక్కలై ఉంటుందో! ఆ మూగమనసు ఎంతగా రోదించి ఉంటుందో!

"ప్చ్... మేమెక్కడ కనిపిస్తాంలే నీకు. ఎంత కానివాళ్లం అయితే మాత్రం ఇప్పుడా వొచ్చేది మామయ్యా?" నన్ను చూస్తూ ఎదురుగా నిలబడి నవ్వుతూ ఎత్తిపొడుపుగా పలకరించింది.

ఆ మాట ఎక్కడో తగిలినట్టుగా... గాయం కనిపించని బాధ... మనసు విలవిలలాడింది.

దొండపండంటి ఛాయ... బాగా తగ్గినట్టు... కాస్త నల్లమబ్బులు కమ్మినట్టు... వెన్నెల రాత్రి మసకేసినట్టు అనిపించింది.

"సుమతక్కకి వాళ్లూర్లో పెళ్లి ఉందంటగా! అక్కడి కెళ్లిందా?" మళ్లీ తనే పలకరించింది.

పట్టుచీర, మెడలో ముత్యాల హారం, ముక్కున మెరుస్తున్న ముక్కెర. నిండుగా ఉదయసంధ్యలా నా ఎదురుగా ఆమె...

నవ్వుతూ నా వైపు చూస్తూ, నా ముఖంలో మారుతున్న రంగులు గమనిస్తూ... నా కళ్లల్లోకి సూటిగా... చిలిపిగా... ఆరాధనగా చూసింది.

చూపులు నిలపలేక తల తిప్పాను. ఆమె నవ్వుతూ అలాగే చూస్తూనే ఉంది. నా కళ్లల్లోనే కాదు. మనసులో కూడా ఓటమి చెందానన్న భావం తొణకిసలాడింది.

నా ముఖంలో భావాలు చదివేసిందేమో!""పిచ్చిమామయ్యాక జీవితంలో సగానికి పైగా ముందు కొచ్చేశాము. ఇంకా నీలో నువ్వు మథనపడతానే ఉండావు. ఎప్పటికీ ఇంతేనా మామయ్యా నువ్వు. ఏంది ఇంత చిక్కిపోయావు. అక్కయ్య బాగా మాడుస్తున్నట్టే ఉందే! అప్పట్లాగే ఉందా ఏమైనా మారిందా?"

"నీకు తెలీదా?" ముక్తసరిగా అన్నాను.

అదే అనురాగం... అదే ఆప్యాయత... అదే పలకరింపు. గుండెల్లో బడబానలం దాచుకుందో... గొంతులోకి గరళాన్ని మింగిందో! పైకి మాత్రం ఎప్పటి పద్మలానే మామూలుగానే.

"అప్పట్లాగే పోటీలు పడి పోట్లాడుకుంటున్నారా, ఒకరికొకరు సర్దుకుపోతున్నారా!" ఈడ్చి చెంపపై కొట్టినట్టు అనిపించింది.

జీవం లేని నవ్వొకటి ఆమె వైపు విసిరాను.

"ఇట్టొచ్చి కూర్చో" కుర్చీ చూయించింది. "ఏ విషయమూ సరిగా చెప్పవు కదా!

పురాతనకాలానికి సంబంధించిన ప్రశ్న మళ్లీ... మళ్లీ... ఇప్పటికీ అడుగుతున్నట్టుగానే అడిగింది.

ఎక్కడో జ్ఞాపకాల పొరలు ఒక్కటొక్కటి... కదులుతున్నట్లు. ఇంట్లో బంతి భోజనం చేస్తున్న వాళ్ళ [illegible] వడ్డన చెయ్యడానికి లోపలికి పోయాక పద్మ సుమతిని చేసుకోవడం చదువు కోసమా, నాగరికత కోసమా, కట్నం కోసమా? పెళ్లైన ఏడు తనకు మనశ్శాంతినీ, సంతృప్తినీ చేకూర్చింది! జీవితాన్ని హాయిగా నవ్వుతూ తుళ్లుతూ సంతోషంగా ఏ క్షణాన అనుభవించాను! ఒక్కసారి బేరీజు వేసుకోవడానికి ప్రయత్నించాను.

ఎంత అభిమానం...ఎంత అప్యాయత... ప్రేమ పొంగే సిరులురా ఇవి. మరులు గొలిపే మనసురా ఇది... ఇదంతా అభిమానమే... మనుషులు సంతోషంగా బతకడానికి ఎన్నెన్ని ప్రేమాభిమానాలు కావాలి? అపారమైన ఆప్యాయతా కుసుమాలు మనసు నిండా పరుచుకుంటే... ఆనందం వెల్లివిరిసి... సరిగమలు పల్లవించి... తనువులు పులకరించి.. .ఒకరిలో ఒకరుగా... ఆ ఇద్దరూ...

ఉద్యోగం. చాలీ చాలని జీతం. వచ్చిన దాంతో సంతృప్తి చెందిందా తను! ఎండ మావుల వెంట పరిగెత్తింది. నన్నూ పరిగెత్తించింది. పరుగెత్తీ పరుగెత్తీ క్షణం ఆలోచన ల్లేకుండా ఏదో వెతుకులాట. ఇంకా ఇంకా సంపాయించాలన్న తపనతో పోగొట్టుకున్న దేమిటి? సంపాయించిం దేమిటి? అనుకుంటే శూన్యమే కళ్ల ముందు నిల్చింది.

మనశ్శాంతి పోయింది. ఇంటి నిండా అశాంతి అలుముకుంది. ఒక్క కొడుకైనా వాణ్ని ఏనాడూ పట్టించుకున్న పాపాన పోయిందీ లేదు. అందుకే వాడిలా గాడి తప్పాడు.

లాభనష్టాల్లో నష్టాలే చుట్టుముట్టడంతో సుమతి నోరు పారేసుకునేది. అసహనంతో నా నోరు కలిసేది. ఈ విషయాన్ని చుట్టూ అందరూ వినడం, ఏంతగా చెప్పుకోవడం పరిపాటై పోయింది.

ఈ విషయాన్ని పద్మ చెవిన పడ్డప్పుడు ఎంత బాధపడిందో! అప్పుడు కూడా నా పక్షాన్నే నిలబడింది. "ఇంతవాళ్లం అయ్యాం. ఒకరికి చెప్పాల్సిన వయసులో మనమే అర్థం చేసుకోకపోతే ఎట్లా మామయ్యా? నలుగురూ నాలుగు రకాలుగా అనుకుంటున్నారు. ఇదేం బాగా లేదు. నాకే తల కొట్టేసి నట్లయ్యింది. తను ఏమన్నా నువ్వు సర్దుకుపోవొచ్చు కదా!" తన ఔదార్యంతో భూమి చీలి లోపలికి పోయిన భావన.

అప్పుడనిపించింది. పద్మ తన సహధర్మచారిణి అయి ఉంటే ఇంత నరకం అనుభవించేవాణ్నా? అసలు నేను బాధ పడుతుంటే తను చూడగలిగేదా? నా కోసం తన ప్రాణాలనైనా సంతోషంగా అర్పించేంత విశాలహృదయం కలిగిన పద్మక్కడ? సుమతెక్కడ? నక్కకీ, నాకలోకానికీ ఉన్నంత తేడా. ఎన్ని సార్లు ఆ విధంగా తలపోసుకున్నానో! చేతులు కాలాక అనుకుంటే ఏముంది?

"రా... మామయ్యా అన్నం తిందువు గానీ," అరిటాకు వేస్తూ పిల్చింది. ప్రేమగా అభిమానంగా జీవించటానికి ఈ బాదరబందీలన్నీ అవసరమా! ఒక్క మంచి మనసు తోడుంటే... జీవితం... హాయిగా... తీయగా... కమ్మని కలలా కరిగిపోతుంది కదా!

రానురాను పద్మంటే ప్రేమతో పాటు భయభక్తులు కూడా పెరిగాయి నాలో. ఆమె హుందాతనం ముందు ఎన్నెన్నో సమాధానాలు లభ్య మయ్యా యి నాకు.

ముందు కూర్చొని అన్ని రకాల వంటకాలూ వడ్డిస్తుంటే... ప్రేమనీ అభిమానాన్ని... రంగరించి ఆకులోకి వొంపుతున్నట్టే ఉంది.

తల పైకెత్తి "పద్మా! ఎంతగా ఎదిగిపోయావో అంతగానూ వొదిగిపోతావు" ముద్ద నోట్లో పెట్టుకుంటూ చెప్పాను.

సమాధానంగా పెదాలపై చిరునవ్వు!

"అమ్మాయికి మెడిసిన్ సీటొచ్చిందంటగా?" నెమ్మదిగా అడిగాను.

"అవును వొచ్చింది. దాని కోసమేగా మేమిద్దరం రెక్కలు ముక్కలు చేసుకుంటు న్నాము. ఎప్పుడో వాళ్ల నానకి మనసులో పడిందంట. పాకాలలో డాక్టర్ల సందర్నీ చూసి ఆయనకి కూడా కూతుర్ని డాక్టర్ని చెయ్యాలని కోరిక కలిగిందట. మనిషి తల్చుకుంటే సాధించలేనిది ఏముంది అన్నాడు నాతో ఒక రోజు. ఆయనేందో మాట్లాడతా ఉంటాళ్లే అనుకున్నా నా రోజు. తరువా త్తరువాత పిల్లకి ఆయన చెప్పే మాటలూ... పిల్ల దానికి తగ్గటుగా చదవడమూ చూడ్డంతో, నాక్కూడా నిజమే ననిపించింది.

"కానియ్యి. ఉండ రెండు మడిసెక్కలూ చేసుకుందాం. ఇద్దరం కష్టపడితే ఒక పిల్లని చదివియ్యడం అంత కష్టమేమీ కాదులే అని నేనూ గట్టిగానే చెప్పాను. అంటే అప్పట్నుంచీ యెనక్కి తిరిగి చూడలేదు. పిల్లకూడా పట్టుదలగా చదివింది. సీటు సంపాయిచ్చింది" ఆనందంలో మునిగి పోతూచెప్పింది పద్మ.

"నీ కొడుకేం చదువుతున్నాడు?" అడగకుండా ఉంటే బాగుంటుంది మనసులో ముక్కోటి దేవతలకు మొక్కుకుంటున్నాను. అడగనే అడిగేసింది.

"నా కొడుకా?" నిట్టూరుస్తూ అన్నాను. "వాడూ చదువులోనే ఉన్నాడు. అయినా నేను రోడ్డున పోతుంటే కదా, వాడు దారిన నడవడానికి. ఏం చేస్తాడో వాడికే తెలియదు. ఇంక నాకేం తెలుస్తుంది. అది కావాల. ఇది కావా లంటూ, అటూ ఇటూ పరుగులు పెడుతుం టాడు. ఇప్పటికి ఏ ఒడ్డూ దరీ చేరలేదు."

"అట్లా అనకపోతే... మీ మొగుడూపెళ్లాలిద్దరిలో ఒక్కరు పట్టించుకున్నా వాడు అట్టా తయారయ్యేవాడా! ఏదైనా మన చేతుల్లోనే ఉందిలే మామయ్యా!" చేతిలో అన్నం గిన్నె వొంచి అన్నం వడ్డించ బోయింది.

"వొద్దు...వొద్దు...పద్మా!" అంటూ అడ్డు చెబుతూ చేతిని పట్టుకున్నాను.

ఏమనుకుందో, నెమ్మదిగా చెయ్యి వెనక్కు లాక్కుని, "నువ్వు ఏమీ మారలేదు మామయ్యా! నీకేం కావాలో, ఎంత కావాలో, ఇప్పటికీ తెలియదు. ఎప్పటికీ తెలియదేమో కూడా..." అంటూ అన్నం పెట్టింది ఆప్యాయంగా.

ఈ సారి కాదనలేకపోయాను.

ఎంత అభిమానం... ఎంత అప్యాయత... ప్రేమ పొంగే సిరులురా ఇవి. మరులు గొలిపే మనసురా ఇది... ఇదంతా అభిమానమే... మనుషులు సంతోషంగా బతకడానికి ఎన్నెన్ని ప్రేమాభిమానాలు కావాలి? అపారమైన ఆప్యాయతాకుసుమాలు మనసు నిండా పరుచుకుంటే... ఆనందం వెల్లివిరిసి... సరిగమలు పల్లవించి... తనువులు పులకరించి... ఒకరిలో ఒకరుగా... ఆ ఇద్దరూ ఒక్కరుగా కష్టాల్లోనూ... నష్టాల్లోనూ...సుఖదుఃఖాల్లోనూ ఒకరికి ఒకరు తోడుగా... నీడగా... హాయిగా... కమ్మని కాలాన్ని కరగదీస్తూ... కరగదీస్తూ... ఇంత కన్నా జీవితంలో మనిషికేం కావాలి?

సంతోషానికి అవధులు లేని జీవితమే జీవితం కదా! మనసు తెలిసిన మనిషి ఎదురుగా ఉండడం కన్నా ఈ లోకంలో ఇంకేం కావాలి ఇప్పుడు సంతోషసాగరంలో ఎన్ని రత్నాలు, ఎన్ని వజ్రాల రాశులు. జీవితాల్లో వెలుగులు నిండిన ఆ భాగ్యజీవు లెందరో!

అన్నం తిని లేచేటప్పటికి హారతి పళ్లెంలో ఆకులూ, వొక్కలూ, సున్నంతో పద్మ వొచ్చి ఎదురుగా నిలబడింది.

చెయ్యి కడుక్కుని తుడుచుకుంటూ, ఆమె దగ్గిర కొచ్చి నవ్వుతూ ఆమె చేతిలోని పళ్లెం వంకా, ఆమె వంకా చూస్తున్నాను.

"తీసుకో మామయ్యా" పెదాలపై మృదుమధురమైన దరహాసంతో అరచేతిలోని పళ్లెం ముందుకు సాచింది.

ఆమెను చూస్తూ పళ్లెంలో చేయి పెట్టి ఆకులు తీసుకోబోయాను. పళ్లెం జారి కింద పడింది.

ఆకులూ, వక్కలూ నేలపా లయ్యాయి.

కిందకు వంగి తియ్యగోతూ ఆమె వైపు చూశాను. అరవిరిసిన మందారంలా... ముగ్ధమనోహరంగా... పుచ్చపువ్వుల పౌర్ణమి వెన్నెల్లా... నిండు ముత్తైదువలా ఆకాశమంత ఎత్తులో ఆమే... భూమిపై నేనూ...

"నీ కెందుకు మామయ్యా లే...నేను తీస్తాను" అంటూ చెయ్యి పట్టుకుని లేపి ఆకులూ, వక్క పొడి ఏరి పళ్లెంలో వేసింది.

రెప్పలార్పకుండా ఆమె వైపు చూస్తుంటే... "పిచ్చి మామయ్యా! ఇంత ఎదిగావు ఎందుకు? ఏమీ తెలియదు! నువ్వు ఎప్పటికీ నా మామయ్యవే... ఆ... మామయ్యవే!" చెంప మీద చేత్తో చిరుసవ్వడి చేసి వడివడిగా బయటకు పోయింది.

ఆ స్పర్శ సోకిన చోట తడుముకుంటూ ఆమె పోయిన వైపే చూస్తుండి పోయాను. ●